




వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయ కొండదిగువ వరాహ పుష్కరిణిలో హంస వాహనంపై విహరిస్తున్న అప్పన్న స్వామి, (ఇన్‌సెట్‌లో) వేణుగోపాల స్వామి అలంకరణలో సింహాద్రినాథుడు

అప్పన్న జల విహారం

వైభవంగా స్వామివారి తెప్పోత్సవం

సింహాచలం వరాహలక్ష్మీనృసింహస్వామి తెప్పోత్సవాన్ని శుక్రవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. ఏటా పుష్యమాస బహుళపక్ష అమావాస్య నాడు స్వామివారు కొండదిగువన పుష్కరిణిలో ఉభయ దేవేరులతో నౌకా విహారం చేయడం ఆనవాయితీ. ఈ ఏడాది కూడా ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని హంసాకృతిలో తీర్చిదిద్దిన నౌకలో ముమ్మారు మండపం చుట్టూ తిప్పారు.

- వివరాలు 5వ పేజీలో

నేడు చింతపల్లికి షర్మిల

» పోలీసుల కట్టుదిట్టమైన భద్రత



చింతపల్లి, ఫిబ్రవరి 9: పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శనివారం చింతపల్లిలో పర్యటించనున్నారు. షర్మిల పర్యటనకు కాంగ్రెస్ నాయకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నర్సీపట్నం నుంచి వాహనంలో మధ్యాహ్నం ఆమె చింతపల్లి చేరుకుంటారు.



చింతపల్లి- చౌడుపల్లి మార్గంలో తనిఖీలు నిర్వహిస్తున్న బాంబ్ స్క్వాడ్ బృందాలు

నేరుగా చింతపల్లి డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సభావేదిక వద్దకు బస్సులో వెళతారు. అయితే కాంగ్రెస్ నాయకులు తొలుత హనుమాన్ జంక్షన్ నుంచి ర్యాలీగా డిగ్రీ కళాశాలకు ఆమెను తీసుకు వెళ్లాలని భావించారు. అయితే పోలీసులు అనుమతించకపోవడంతో ఆమె సభా వేదిక వద్దకు నేరుగా వచ్చి ప్రసంగించనున్నారు. గత నెలలో ... మిగతా 6వ పేజీలో

నేడు విశాఖకు లోకేష్

విశాఖపట్నం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శనివారం సాయంత్రం విశాఖ రానున్నారు. ఉత్తరాంధ్రలో పది రోజులపాటు నిర్వహించనున్న 'శంఖారావం' కార్యక్రమాన్ని ఆయన ఆదివారం ఇచ్ఛాపురం నుంచి ప్రారంభించనున్నారు. శనివారం సాయంత్రం విమానంలో విశాఖ రానున్న లోకేశ్...ఇక్కడ నుంచి రోడ్డు మార్గంలో ఇచ్ఛాపురం వెళ్లి రాత్రికి అక్కడే బస చేస్తారు.



నరకమా లేక వసతి గృహమా?

అత్యంత దారుణంగా చింతపల్లి బీసీ వెల్ఫేర్ బాలికల వసతి గృహం


- » 87 మంది విద్యార్థినులకు తలుపుల్లేని ఒకే ఒక్క మరుగుదొడ్డి
- » స్నానపు గది కూడా అంతే..
- » కాలకృత్యాలు తీర్చుకోవాలంటే వేకువజామున బారులు తీరాల్సిందే..
- » సమయానికి పాఠశాలకు వెళ్లడానికి సిగ్గు విడిచి ఆరు బయట స్నానాలు చేస్తున్న దయనీయ స్థితి
- » తలుపుల్లేని కిటికీలు, కటిక నేలపైనే నిద్ర
- » పెచ్చులూడుతున్న భవనం శ్లాబ్
- » గిరిజన బాలికలకు తప్పని అవస్థలు

చింతపల్లి, ఫిబ్రవరి 9: తలుపుల్లేని మరుగుదొడ్డి. స్నానపు గది.. అవి కూడా 87 మంది విద్యార్థినులకు ఒకే ఒక్కటి. పెచ్చులూడుతున్న శ్లాబ్, తలుపుల్లేని కిటికీలు, కటిక నేలపైనే పడక.. ఇంత దయనీయ పరిస్థితి మరెక్కడో కాదు మండల కేంద్రం చింతపల్లిలోని ఐటీడీఏ క్వార్టర్స్‌లో కొనసాగుతున్న బీసీ వెల్ఫేర్ బాలికల వసతి గృహంలో ఉంది. విద్యారంగానికి కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నామని ప్రచారం చేసుకుంటున్న వైసీపీ ప్రభుత్వం ఈ వసతి గృహాన్ని పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఐటీడీఏ క్వార్టర్స్‌లో కొనసాగుతున్న బీసీ వెల్ఫేర్ వసతి గృహం

చింతపల్లి ఐటీడీఏ క్వార్టర్స్‌లో బీసీ వెల్ఫేర్ బాలికల వసతి గృహాన్ని నిర్వహిస్తున్నారు. వాస్తవానికి ఈ వసతి గృహానికి గతంలో సుమారు 1.5 ఎకరాల స్థలం కేటాయించినప్పటికి శాశ్వత భవనం నిర్మించలేదు. ఈ గృహంలో 95 శాతం మంది గిరిజన విద్యార్థినులే ఉన్నారు. కేవలం 5 శాతం మంది మాత్రమే ఇతర కులాల విద్యార్థినులు విద్యాభ్యాసం చేస్తున్నారు. విద్యార్థినులు కిలోమీటరు దూరంలో ఉన్న ... మిగతా 6వ పేజీలో



87 మంది విద్యార్థినులు ఉపయోగిస్తున్న తలుపు ఊడిపోయిన ఒకే ఒక మరుగుదొడ్డి



తలుపులేని ఒకే ఒక స్నానపు గది

గిరిజన చట్టాలను గౌరవించాల్సిందే..

» ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకర్రావు



బొర్రాగుహలు వద్ద జిప్‌లైనర్‌ను పరిశీలిస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకర్రావు, తదితరులు

అరకులోయ, ఫిబ్రవరి 9: గిరిజనుల హక్కులు, వారికి రాజ్యాంగబద్ధంగా సమకూరిన చట్టాలను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకర్రావు తెలిపారు. బొర్రాలో పర్యాటక సంస్థ పరంగా తలెత్తుతున్న సమస్యలు, గిరిజన చట్టాల ఉల్లంఘనపై ఫిర్యాదులు అందడంతో ఆయన శుక్రవారం బొర్రాలో పర్యటించారు. బొర్రా గుహలు, పరిసరాల్లో ఏపీటీడీసీ చేపడుతున్న పనులను ఆయన పర్యటించారు. అనంతరం బొర్రా గ్రామ సచివాలయంలో మండల అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి సర్పంచ్ జన్ని అప్పారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్రావు మాట్లాడుతూ ప్రైవేటు వ్యక్తులకు జిప్‌లైనర్, రిసార్టుల నిర్వహణ బాధ్యతలు అప్పగించడంపై ఫిర్యాదులు అందాయన్నారు. గిరిజన చట్టాలను ఉల్లంఘించడమే కాకుండా పీసా, గ్రామసభ తీర్మానం లేకుండా ఎటువంటి పనులు చేయకూడదని స్పష్టం చేశారు. వీటన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే బొర్రా పంచాయతీలో ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.

వినతుల వెల్లువ

ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకర్రావును అనంతగిరి, అరకులోయ, చింతపల్లి మండలాల పరిధిలో ఏపీటీడీసీ ఆధ్వర్యంలో పనిచేస్తున్న కాంట్రాక్టు, మేన్ పవర్, డైలీ వేజ్ వర్కర్ల సంఘం రాష్ట్ర యూనియన్ అధ్యక్షుడు, అల్లూరి జిల్లా అధ్యక్షుడు, యూనియన్ ప్రతినిధులు కలిసి తమ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. అటవీ శాఖ పరిధిలో ఉన్న బొర్రా గుహలు వద్ద జిప్‌లైనర్‌ను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడంపై కూడా ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం కేకే లైన్ డబ్లింగ్ పనులు ముమ్మరంగా చేపడుతున్న నేపథ్యంలో బొర్రా గుహలు పైన రెండవ లైన్ ఏర్పాటు చేస్తే భవిష్యత్తులో బొర్రాగుహలు కూలిపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. బొర్రా గుహలు నుంచి పంచాయతీకి రావలసిన 20 శాతం అభివృద్ధి నిధులను ఏపీటీడీసీ చెల్లించడం లేదని, సుమారు రూ.10 కోట్ల మేర పంచాయతీకి బకాయి పడిందని ఎస్టీ కమిషన్ సభ్యురాలు రామలక్ష్మి, ఎంపీపీ నీలవేణి, బొర్రా సర్పంచ్ జన్ని అప్పారావు తదితరులు ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వివరించారు. కమిషన్ చైర్మన్ వెంట ఐటీడీఏ నుంచి డీడీ కొండలరావు, ఎంపీడీవో శ్రీహరిత్, తహసీల్దార్ నరసింహమూర్తి, ఎస్ఐ రాము, సమత డైరెక్టర్ రబ్బాప్రగడ రవి, తదితరులు వున్నారు.



వినతులు స్వీకరిస్తున్న శంకర్రావు

అన్న చేతిలో తమ్ముడు హతం

» భూ వివాదమే కారణం




దేవదాస్ మృతదేహం

చింతపల్లి, ఫిబ్రవరి 9: మండలంలోని బెన్నవరం పంచాయతీ పోతురాజుగున్నలు గ్రామంలో అన్నదమ్ముల మధ్య భూ వివాదం తలెత్తింది. దీంతో తమ్ముడిని అన్న హత్య చేశాడు. దీనికి సంబంధించి సీఐ కె.రమేశ్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. పోతురాజుగున్నలు గ్రామానికి చెంది పాంగి రామదాస్(60), పాంగి దేవదాస్(55)లు అన్నదమ్ములు. తండ్రి సంపాదించిన పదెకరాల భూమిని వారిద్దరూ ఐదెకరాల చొప్పున పంచుకున్నారు. రామదాస్‌కి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. పాంగి దేవదాస్‌కి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అన్నదమ్ముల పిల్లలకు వివాహాలు జరిగాయి. అయితే రామదాస్ మద్యానికి బానిసై వ్యవసాయం సరిగా చేయకపోవడం వల్ల ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నాడు. తమ్ముడు దేవదాస్ వ్యవసాయంలో రాణిస్తున్నాడు. దీంతో తమ్ముడిపై అన్న అసూయ పెంచుకున్నాడు. మద్యం సేవించిన సమయంలో రామదాస్ తన తమ్ముడు దేవదాస్ వద్దకు వెళ్లి 'నీకు ఇద్దరూ కుమార్తెలే, నాకు ఒక కొడుకు ఉన్నాడు, నీ భూమి నా కుమారుడికి ఇచ్చేయ్' అంటూ గొడవ పడేవాడు. గురువారం సాయంత్రం ఇదే విషయమై ఇద్దరి మధ్య ఘర్షణ తలెత్తింది. తండ్రి నుంచి వచ్చిన ఆస్తిని తన ఇద్దరు కూతుళ్లకు ఇస్తానని, ఎవరికి ఇచ్చే ప్రసక్తి లేదని దేవదాస్ చెప్పడంతో మద్యం మత్తులో ఉన్న రామదాస్ ఆగ్రహంతో రగిలిపోతూ కత్తితో తమ్ముడిపై దాడి చేశాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన దేవదాస్‌ని కుటుంబ సభ్యులు లోతుగెడ్డ పీహెచ్‌సీకి తరలించగా అతడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

వణికిస్తున్న చలి

» దట్టంగా పొగమంచు » జి.మాడుగులలో 15.9 డిగ్రీలు నమోదు



చింతపల్లిలో మంచు

పాడేరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నప్పటికీ పొగమంచు తీవ్రత మాత్రం తగ్గడం లేదు. దీంతో చలి తీవ్రత, పొగమంచు సైతం కొనసాగుతున్నది. జి.మాడుగులలో 15.9, పాడేరులో 16.1, పెదబయలులో 16.3, ముంచంగిపుట్టులో 16.5, డుంబ్రిగుడలో 16.6, అరకులోయలో 17.4, హుకుంపేటలో 17.7 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు శుక్రవారం నమోదయ్యాయి. శీతాకాలం నేపథ్యంలో మరికొన్ని రోజులు చలి వాతావరణం కొనసాగే అవకాశాలున్నప్పటికీ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సైతం క్రమంగా పెరుగుతాయని వాతావరణం శాఖ ప్రకటించింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఉదయం తొమ్మిది గంటల వరకు దట్టంగా పొగమంచు కమ్ముకున్నది. దీంతో ఏజెన్సీలో రోడ్లు స్పష్టంగా కనిపించకపోవడంతో హెడ్ లైట్లు వేసుకుని వాహనాలు రాకపోకలు సాగించాల్సి వచ్చింది.

చింతపల్లి, జీకే వీధిలో..

చింతపల్లి: గూడెంకొత్తవీధి, చింతపల్లి మండలాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగినప్పటికి మంచు తీవ్రత తగ్గలేదు. శుక్రవారం చింతపల్లిలో 17.8, జీకేవీధిలో 17.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్ తెలిపారు. గిరిజన గ్రామాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల కాస్త చలి తీవ్రత తగ్గింది. అయితే మంచు దట్టంగా కురుస్తున్నది. అర్ధరాత్రి నుంచి మరుసటి రోజు ఉదయం పదిన్నర గంటల వరకు మంచు అధికంగా కురుస్తున్నది. దీంతో వాహన చోదకులు ... మిగతా 6వ పేజీలో



పాడేరు ఘాట్‌లో అమ్మవారి పాదాలు వద్ద పొగమంచు

పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వహణపై ఆరా

» మన్యంలో భోజన పథకం డైరెక్టర్ పర్యటన

పాడేరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో మధ్యాహ్న భోజన పథకం డైరెక్టర్ శోభిక(ఐఏఎస్) శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా గిరిజన ప్రాంతంలోని విద్యాలయాల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై ఆమె ఆరా తీశారు. ఇక్కడికి వచ్చిన ఆమె తొలుత స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనంపై ఆరా తీశారు. అనంతరం స్థానిక గుడివాడ వీధిలోని ప్రాథమిక పాఠశాల, కిండంగి పంచాయతీ కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలను ఆమె సందర్శించి, అక్కడ మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును స్వయంగా పరిశీలించి, విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు. పలువురు విద్యార్థులతో మాట్లాడి భోజన నిర్వహణ, మెనూ, ఇతర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, ఎంఈవోలు ఎస్.రామచంద్రరావు, సీహెచ్ సరస్వతి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



పాడేరులోని గుడివాడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డైరెక్టర్ శోభికా

ఏడేళ్ల బాలికపై యువకుడి అత్యాచారం

» పరారీలో నిందితుడు

పెదబయలు, ఫిబ్రవరి 9: పాఠశాలకు వెళుతున్న బాలికను ఓ యువకుడు అటవీ ప్రాంతానికి తీసుకువెళ్లి అత్యాచారం చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించి పెదబయలు ఎస్ఐ పులి మనోజ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని అడుగుల పుట్టు పంచాయతీకి చెందిన బాలిక(7) ఈ నెల 7వ తేదీన పాఠశాలకు వెళుతోంది. ఆ పంచాయతీలోని లకేపుట్టు గ్రామానికి చెందిన మర్రి సూరిబాబు(22) ఆ బాలికను అనుసరించాడు. ఆ బాలిక అక్క చదువుతున్న పాఠశాలకు తీసుకువెళతానని మాయ మాటలు చెప్పాడు. కొంత దూరం వెళ్లాక ఆ బాలికను అటవీ ప్రాంతానికి తీసుకువెళ్లి అత్యాచారం చేశాడు. సాయంత్రమైనా తమ కుమార్తె ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు చుట్టుపక్కల గాలించారు. ఫలితం లేకపోవడంతో అటవీ ప్రాంతంలో గాలిస్తుండగా వీరిని చూసి సూరిబాబు ఆ బాలికను విడిచిపెట్టి పారిపోయాడు. ఈ మేరకు పోలీసులకు బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం పాడేరు ఏరియా ఆస్పత్రికి తరలించామని ఎస్ఐ తెలిపారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశామని, అతని కోసం ముమ్మరంగా గాలిస్తున్నామని ఆయన చెప్పారు.

క్రైం... crime news

భూ వివాదంలో కొట్లాట

» ముగ్గురిపై కేసు

గొలుగొండ, ఫిబ్రవరి 9: భూ వివాదానికి సంబంధించి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ కృష్ణారావు శుక్రవారం తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని పాతమల్లంపేట గ్రామ పంచాయతీ శివారు అచ్చియ్యపేట గ్రామానికి చెందిన కెల్లా రాజులు, తన కుటుంబ సభ్యులకు మధ్య భూ సరిహద్దుల విషయంలో వివాదం చోటుచేసుకుంది. ఈ వివాదంలో కెల్లా జగ్గన్న, కెల్లా పార్వతి, నాగరాజులు కలిసి రాజులు తలపై కర్రలతో కొట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

హైవేపై స్పిరిట్ ట్యాంకర్ లారీ బోల్తా


హైవేపై బోల్తాపడిన స్పిరిట్ ట్యాంకర్ లారీ

నక్కపల్లి, ఫిబ్రవరి 9: మండలంలో ఒడ్డిమెట్ట హైవే జంక్షన్ వద్ద శుక్రవారం సాయంత్రం స్పిరిట్ లోడుతో వెళ్తున్న ట్యాంకర్ లారీ బోల్తాపడింది. దీనికి సంబంధించి వివరాలిలా వున్నాయి.. తుని నుంచి విశాఖవైపు స్పిరిట్ లోడుతో వెళుతున్న ట్యాంకర్ లారీని, అదే మార్గంలో వెనుక నుంచి వేగంగా వస్తున్న బొలేరో వ్యాన్ ఢీకొన్నది. దీంతో ట్యాంకర్ లారీ అదుపు తప్పి రోడ్డుకు అడ్డంగా బోల్తాపడింది. బొలేరో వ్యాన్ హైవే పక్కన పొలాల్లోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ గాయపడ్డాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు


క్షతగాత్రుడిని పాడేరు ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

పాడేరురూరల్, ఫిబ్రవరి 9: పాడేరు ఘాట్ మార్గంలోని వంట్ల మామిడి సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం జీపు, బైక్ ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. అరకు నుంచి జి.మాడుగుల మండలం వంతాల పంచాయతీ లక్కపాడు గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళుతున్న పాంగి ఈశ్వరరావు(35)ను చోడవరం నుంచి పాడేరుకు ప్రయాణికులతో వస్తున్న జీపు ఢీకొంది. దీంతో ఈశ్వరరావు కుడికాలు విరిగిపోయింది. ఆ సమయంలో అటుగా వచ్చిన టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గబ్బాడ సింహాచలం క్షతగాత్రుడిని 108 వాహనంలో స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరి నుంచి 23 మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ, ఫిబ్రవరి 9: మండలంలో వాడచీపురుపల్లి పంచాయతీ పరిధి పందివానిపాలెం గ్రామానికి చెందిన పి.పైడమ్మ ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి ఎనిమిది బాటిళ్ల కొనుగోలు చేసి ఇంటి వద్ద అమ్మడానికి తీసుకువెళ్తుండగా ఎస్‌ఐ సురేశ్ శుక్రవారం రాత్రి అడ్డగించి పట్టుకున్నారు. అలాగే దలాయిపాలెం గ్రామానికి చెందిన దలాయి అప్పారావు ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి 15 క్వార్టర్ మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి ఇంటికి తీసుకువెళ్తుండగా ఎస్‌ఐ, పోలీసు సిబ్బందితో దాడి చేసి బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

బాల్య వివాహాల నిరోధానికి పటిష్ఠ చర్యలు

» జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి కె.అనంతలక్ష్మి

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 9: జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా పటిష్ఠ చర్యలు తీసుకున్నామని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి కె.అనంతలక్ష్మి తెలిపారు. జీవీఎంసీ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాల్య వివాహాల నివారణకు చేపట్టాల్సిన అంశాలపై జిల్లాస్థాయిలో ప్రధానోపాధ్యాయులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఐసీడీఎస్ పీవోలు, కమిటీ సభ్యులు నిఘా పెట్టి పోలీసు శాఖ సహకారంతో బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి తల్లిదండ్రులకు అవగాహన కలిగించాలన్నారు. దిశ పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి డీఎస్పీ రామవర్మ మాట్లాడుతూ, బాల్య వివాహాలు చేయించిన వారికి, తోడ్పడిన వారికి న్యాయస్థానాలు విధించే శిక్షల గురించి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు సూర్యనారాయణ, బాలల సంక్షేమ జిల్లా అధికారి శరత్, మెడికల్ ఆఫీసర్ ఎస్తేరురాణి, బాలల పరిరక్షణ విభాగం అధికారి పి.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

'రక్షణ' లేని కల్వర్టులు


తహసీల్దార్ కార్యాలయం సమీపంలో రక్షణ గోడ లేని కల్వర్టు

పరవాడ, ఫిబ్రవరి 9: మండల కేంద్రం, పరిసర ప్రాంతాల్లో సుమారు 40 ఏళ్ల క్రితం నిర్మించిన కల్వర్టులు శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా తయారయ్యాయి. ముఖ్యంగా బీసీ బాలుర వసతిగృహం, మండల పరిషత్ కూడలి, జగనన్న కాలనీ సమీపంలో, లంకెలపాలెం మార్గంలో టింబర్ డిపో, తుక్కు దుకాణం ప్రాంతాల్లోని కల్వర్టులకు రక్షణ గోడలు లేవు. దీనివల్ల కల్వర్టుల వద్ద రాత్రి సమయంలో వాహనాలు ఎదురైనప్పుడు పక్కకు తప్పుకునే క్రమంలో అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్వయంగా పరిశీలించి, కల్వర్టులకు వెంటనే రక్షణ గోడలు నిర్మించాలని, సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

» అనకాపల్లి జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ


ఆర్మ్‌డ్ రిజర్వు సిబ్బంది పరేడ్‌ను సమీక్షిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

విశాఖపట్నం, ఫిబ్రవరి 9: వచ్చే ఎన్నికల్లో ఆర్మ్‌డ్ రిజర్వ్ సిబ్బంది అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ సూచించారు. శుక్రవారం ఆయన కైలాసగిరి కొండ దిగువున ఉన్న ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్ క్వార్టర్స్ మైదానంలో రిజర్వ్ పోలీసు సిబ్బంది పరేడ్‌ను సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. డబ్బు, మద్యం, గంజాయి అరికట్టేందుకు చెక్ పోస్టుల వద్ద వాహన తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ చూపిన ఆర్మ్‌డ్ రిజర్వు డీఎస్పీ పి. నాగేశ్వరరావును ప్రశంసాపత్రంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు సతీష్, రామకృష్ణారావు, వెంకట్రావు, అరవింద్ కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	112.00
లైవ్ ధర	132.00
విత్ స్కిన్	234.00
స్కిన్ లెస్	244.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

బెంబేలెత్తిస్తున్న భూ రీసర్వే

తప్పుల తడకగా నమోదు

» అసలుకంటే తగ్గిపోతున్న భూ విస్తీర్ణం
» గగ్గోలు పెడుతున్న రైతులు
» పరిష్కారం చూపని రెవెన్యూ అధికారులు


యర్రా దుర్గాదేవి మీద పట్టాదారు పాస్ పుస్తకంలో 50 సెంట్లు ఉన్న దృశ్యం


రీ సర్వే తరువాత ఇచ్చిన పట్టాలో 48 సెంట్లు ఉన్న దృశ్యం

నర్సీపట్నం, ఫిబ్రవరి 9: జగన్న భూహక్కు-భూ రక్ష పథకం రైతుల పాలిట శాపంగా మారిందన్న విమర్శలు వినవస్తున్నాయి. నర్సీపట్నం రెవెన్యూ డివిజన్‌లోని 357 రెవెన్యూ గ్రామాలకు గాను మొదటి విడత 50 గ్రామాల్లో, రెండో విడత 102 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశారు. తాజాగా మూడో విడత 77 గ్రామాల్లో రీ సర్వే మొదలు పెట్టి 54 గ్రామాల్లో సర్వే పూర్తి చేశారు. సర్వే పూర్తి చేసుకున్న గ్రామాల్లో చాలా వరకు పట్టాలు కూడా పంపిణీ చేశారు. రీ సర్వే చేసేటప్పుడు విస్తీర్ణం తగ్గించి నమోదు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. సర్వే సిబ్బందిని ప్రలోభపెడితే తమ భూమిని పక్క సర్వే నంబరులో కలిపేస్తున్నారని ఆరోపిస్తున్నారు. తమకు న్యాయం చేయాలని ఆధారాలతో సహా రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లినా ప్రయోజనం ఉండడం లేదని రైతులు వాపోతున్నారు. భూములు రీ సర్వేలో ఎదురవుతున్న సమస్యలు, అభ్యంతరాలను పరిష్కరించడానికి రెవెన్యూ అధికారులు పెద్దగా దృష్టి పెట్టడం లేదని విమర్శలు వస్తున్నాయి. చాలా చోట్ల రీ సర్వేలో పాతిన సరిహద్దు రాళ్లు రైతులు తీసి పారేస్తున్నారు.


సంబంగి శ్రీరాములు పేరుతో ఉన్న పట్టాదారు పాసుపుస్తకంలో 2.35 ఎకరాలుగా నమోదై ఉన్న దృశ్యం

తగ్గిపోతున్న భూ విస్తీర్ణం

నర్సీపట్నం కాపువీధికి చెందిన యర్రా దుర్గాదేవికి నర్సీపట్నం మండలం గురొందరపాలెం సర్వే నంబరు 286/6లో పల్లం 33 సెంట్లు, 286/4లో మెట్టు 17 సెంట్లు భూమి ఉండేది. రీ సర్వే చేసిన తరువాత రెండు సెంట్లు తగ్గించి 48 సెంట్లుకు పట్టా ఇచ్చారు. భూమి కొలిస్తే 50 సెంట్లు సరిపోతుంది. రీ సర్వే తరువాత రికార్డుల్లో 48 సెంట్లు నమోదు చేశారు. మిగిలిన రెండు సెంట్లు కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేయమని అడుగుతుంటే చేయడం లేదు. అదే విధంగా నర్సీపట్నం ప్రాంతానికి చెందిన సంబంగి శ్రీరాములుకి మాకవరపాలెం మండలం మల్లవరం గ్రామంలో సర్వే నంబరు 79/2లో ఎకరా పద్దెనిమిదిన్నర సెంట్లు, 79/3లో ఎకరా పదహారున్నర సెంట్లు .. మొత్తం 2.35 ఎకరాల భూమి ఉంది. రీ సర్వేలో 35 సెంట్లు తగ్గించి రెండు ఎకరాలుగా నమోదు చేశారు. మిగిలిన 35 సెంట్లు శ్రీరాములు భూమిని ఆనుకొని ఉన్న భూమిలో కలిపేసినట్టు ఉండడంతో జిల్లా కలెక్టర్‌కి, ఆర్డీవోకి ఫిర్యాదు చేశారు. అయినా సమస్య పరిష్కరించడం లేదు. నర్సీపట్నానికి చెందిన కామిరెడ్డి సత్యనారాయణకు సంబంధించి గొలుగొండ మండలం చీడిగుమ్మల గ్రామంలో సర్వే నంబరు 63/1లో రెండు సెంట్లు, 94/3లో 17 సెంట్లు, 91 సర్వే నెంబరులో 78 సెంట్లు భూమి తగ్గిపోయిందని గగ్గోలు పెడుతున్నారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కావడం లేదని అంటున్నారు.

పీవీకి భారతరత్న తెలుగు వారికి గర్వకారణం

» మాజీ మంత్రి దాడి వీరభద్రరావు


పీవీ నరసింహారావుతో దాడి వీరభద్రరావు (ఫైల్)

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 9: దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారం ప్రకటించడం తెలుగు ప్రజలకు ఎంతో గర్వకారణమని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు పేర్కొన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, ఒకే ఏడాది ఐదుగురు ప్రముఖులను భారతరత్న పురస్కారాలకు ఎంపిక చేయడం చరిత్రాత్మకమని అన్నారు. వీరిలో పీవీ నరసింహారావు, ఎల్‌కే ఆడ్వాణీ, వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్‌తో తనకు పరిచయం వుండడం సంతోషంగా వుందన్నారు. పీవీ నరసింహారావు తనను నాటక రచయితగా ప్రేమించేవారన్నారు.

అధ్యాపకుడిగా ఉన్నప్పటి నుంచి ఆయనతో సాహిత్య సంబంధాలు ఉండేవని చెప్పారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్‌టీ రామారావుకు కూడా భారతరత్న పురస్కారాన్ని కేంద్ర ప్రభుత్వం త్వరలో ప్రకటిస్తుందని ఆశిస్తున్నట్టు వీరభద్రరావు తెలిపారు.

పరిహారం ఇవ్వకుండా కారిడార్ పనులు ఎలా చేస్తారు?

» ఏపీఐఐసీ అధికారులను నిలదీసిన రైతులు
» గ్రామాల్లో సభలు ఏర్పాటు చేయాలని టీడీపీ, సీపీఎం నేతలు డిమాండ్


కారిడార్ భూముల్లో నిరసన తెలుపుతున్న రైతులు, టీడీపీ, సీపీఎం నాయకులు

నక్కపల్లి, ఫిబ్రవరి 9: విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ (వీసీఐసీ) కోసం భూములిచ్చిన రైతులందరికీ పూర్తి స్థాయిలో న్యాయం చేయకుండా కారిడార్ పనులు ఎలా చేపడతారని రైతులు, టీడీపీ, సీపీఎం నేతలు ఏపీఐఐసీ అధికారులను నిలదీశారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీసీఐసీలో బల్క్ డ్రగ్ యూనిట్‌కు వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారనే సమాచారం మేరకు పలు గ్రామాలకు చెందిన రైతులు చందనాడలో కారిడార్ భూముల వద్దకు చేరుకున్నారు. అక్కడ వున్న ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ త్రినాథరావుకు, నిర్వాసిత రైతుల సమస్యలను టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు వివరించారు. డి.పట్టాదారులు, సాగుదారులకు పూర్తిస్థాయిలో పరిహారం, ప్యాకేజీ ఇవ్వకుండా పనులు ఎలా చేపడతారని ప్రశ్నించారు. అన్ని గ్రామాల్లో సభలు ఏర్పాటు చేసి రైతుల సమస్యలు తెలుసుకోవాలని కోరారు. ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మాట్లాడుతూ, కాగిత గ్రామంలో ఇళ్లు కోల్పోయే 795 కుటుంబాలకు పునరావాసం కల్పిస్తామని, గ్రామసభలు, ప్యాకేజీ అంశాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో బుచ్చిరాజుపేట, అమలాపురం సర్పంచ్‌లు కాళ్ల శ్రీను, పెదపూడి శంకరరావు, నాయకులు ఎం.రాజేశ్, ఆర్.గోవిందరావు, జి.వెంకటరమణ, అప్పలరాజు, గంగరాజు, సత్తిబాబు, శివ, కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

పుష్కరిణిలో అప్పన్న విహారం

» వైభవంగా స్వామివారి తెప్పోత్సవం
» తరలివచ్చిన భక్త జనం


తెప్పోత్సవంలో పాల్గొన్న భక్తులు

సింహాచలం, ఫిబ్రవరి 9 : వరాహలక్ష్మీనృసింహస్వామి తెప్పోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఏటా పుష్యమాస బహుళపక్ష అమావాస్య నాడు స్వామివారు కొండదిగువ వరాహ పుష్కరిణిలో ఉభయ దేవేరులతో నౌకా విహారం చేయడం ఆనవాయితీ. ఈమేరకు స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అలంకారి కరి సీతారామాచార్యులు శిరస్సున నెమలి పింఛము, చేతిలో వేణువు ధరించిన భంగిమలో ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించారు. మధ్యాహ్నం పవళింపు సేవ తరువాత గోవిందరాజస్వామిని పల్లకిలో ఉంచి మెట్ల మార్గంలో సాయంత్రం 5 గంటలకు కొండ దిగువకు తీసుకువచ్చారు. తొలిపావంచా వద్ద ఈఓ శ్రీనివాసమూర్తి పుష్పమాలిక, పండ్లు, కర్పూర నీరాజనాలిచ్చి ఉత్సవానికి ఆహ్వానం పలికారు. అనంతరం ఉత్సవం కోసం వరాహ పుష్కరిణికి చేరుకున్నారు. వైదికులు ప్రత్యేక పూజలు చేసిన తరువాత ఈఓ కొబ్బరికాయ కొట్టి ఉత్సవాన్ని ప్రారంభించగా పటిష్ఠమైన భద్రత నడుమ ఉత్సవమూర్తిని హంసాకృతి నౌకలో పుష్కరిణి మధ్య మండపం చుట్టూ ముమ్మారు తిప్పారు. అనంతరం వేణుగోపాలుడి మండపంలోకి తీసుకువెళ్లారు. ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఐవీ రమణాచార్యులు, ఆలయ పురోహితుడు కరి సీతారామాచార్యులు ఆగమశాస్త్రోక్తంగా పుష్కరిణి ప్రధాన మండపంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. తిరిగి నౌకలో స్వామివారిని పుష్కరిణి తీరానికి చేర్చి అక్కడి నుంచి పుష్కరిణి సత్రం ఆవరణలో ఉంచారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని కోనేరు వద్ద పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. అనంతరం సర్వజన మనోరంజని వాహనంపై స్వామివారిని అధిష్ఠింపజేసి అడివివరం గ్రామ మూడు ప్రధాన మాడవీధుల్లో తిరువీధి నిర్వహించారు. తిరువీధి మార్గం పొడవునా గ్రామస్థులు స్వామివారికి ఆహ్వానం పలికారు. అనంతరం స్వామివారు తిరిగి మెట్ల మార్గంలో సింహగిరికి చేరుకోవడంతో ఉత్సవం ముగిసింది. నార్త్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి పర్యవేక్షణలో గోపాలపట్నం శాంతి భద్రతల సీఐ సురేష్ సారథ్యంలో 50 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కాగా స్వామివారు తొలపావంచాకు చేరుకున్న దగ్గర నుంచి తిరువీధి ముగిసే వరకు మార్గం పొడవునా ఆరు బృందాలు చేసిన కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

స్టీల్‌ప్లాంటును జాతికి అంకితం చేసింది పీవీనే


విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రారంభిస్తున్న నాటి ప్రధానమంత్రి పీవీ నరసింహారావు (ఫైల్)

విశాఖ స్టీల్‌ప్లాంటును 1992 ఆగస్టు ఒకటో తేదీన ప్రధాన మంత్రి హోదాలో పీవీ నరసింహారావే జాతికి అంకితం చేశారు. పీవీకి కేంద్ర ప్రభుత్వం శుక్రవారం 'భారతరత్న' ప్రకటించిన నేపథ్యంలో నాటి జ్ఞాపకాలను ఉక్కు ఉద్యోగులు, కార్మికులు గుర్తు చేసుకుంటున్నారు. పీవీకి అత్యున్నత పురస్కారం ప్రకటించడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- స్టీల్‌ప్లాంటు

16న 'పారిశ్రామిక సమ్మె- గ్రామీణ బంద్'

» రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు


సమావేశంలో మాట్లాడుతున్న అప్పారావు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 9: కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై సంయుక్త కిసాన్ మోర్చ, కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 16వ తేదీన 'పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్' నిర్వహించనున్నట్టు ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు చెప్పారు. శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నదని ఆరోపించారు. కార్మికులకు సంబంధించి 40 చట్టాలను రద్దు చేసి, కార్పొరేట్ కంపెనీలకు మేలు చేకూర్చేలా, కార్మికులకు తీవ్ర నష్టం కలిగేలా కొత్తగా లేబర్ కోడ్స్‌ను తీసుకువచ్చిందని మండిపడ్డారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ వైఎన్ భద్రం, నాయకులు కోన మోహన్, రాంబాబు, శంకరరావు, గాడి బాలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ సారె ఊరేగింపు


అమ్మవారి సారెను ఊరేగిస్తున్న మహిళలు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 9: పట్టణంలోని విజయరామరాజుపేటలో మరిడిమాంబ అమ్మవారి ఆలయం 8వ వార్షికోత్సవం సందర్భంగా భక్తులు శుక్రవారం సారె ఊరేగింపు నిర్వహించారు. మహిళలు వివిధ రకాల పిండివంటలు, మిఠాయిలు తయారు చేసి ఆలయానికి తీసుకువచ్చారు. సారెతో ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ ప్రతినిధులు ఆళ్ల శివరామ సత్యనారాయణ, బొబ్బిలి అప్పారావు, పలకా రాము, పిట్ల బుద్దేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ పేరుతో వైసీపీ సర్కార్ మోసం

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు ధ్వజం


మాట్లాడుతున్న బుద్ద నాగజగదీశ్వరరావు

అనకాపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నాలుగున్నర సంవత్సరాల నుంచి అధికారంలో వుండి, డీఎస్సీ ఊసెత్తని జగన్ ప్రభుత్వం ఎన్నికల ముందు మెగా డీఎస్సీ అంటూ నిరుద్యోగులను మరోసారి మోసం చేస్తున్నదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు ఆరోపించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో 50,892 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ వుండగా కేవలం 6,100 పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ జారీ చేయడం, పైగా దీనిని మెగా డీఎస్సీ అంటూ ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా వుందన్నారు. డీఎస్సీ నియామకాలు జరిపి అప్రంటీస్ విధానం అమలు చేయడం మరీ ఘోరమని అన్నారు. ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల, ఏటా డీఎస్సీ నోటిఫికేషన్, ఖాళీగా వున్న 2.3 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని 2019 ఎన్నికల్లో జగన్‌రెడ్డి ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఉద్యోగాలను భర్తీ చేయకపోవడం, రాష్ట్రంలో ప్రైవేటు పరిశ్రమలు ఏర్పాటు కాకపోవడంతో ఉద్యోగాలు రాక అనేకమంది చదువుకున్న యువతీ యువకులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ పాలనలో పెట్టుబడుల విషయంలో ఏపీ ప్రథమ స్థానంలో వుండగా, జగన్‌రెడ్డి పాలనలో గంజాయి రవాణాలో అగ్రస్థానంలో ఉందని ఆయన ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు ధనాల విష్ణు చౌదరి, బోడి వెంకటరావు పాల్గొన్నారు.

వెటరన్ క్రీడాకారుడి సత్తా

» జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో రమణమూర్తికి కాంస్య పతకం


జాతీయ స్థాయి పోటీల్లో పతకం సాధించిన రమణమూర్తి

చోడవరం, ఫిబ్రవరి 9: జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పట్టణానికి చెందిన వెటరన్ క్రీడాకారుడు పి.వెంకట రమణమూర్తి కాంస్య పతకం సాధించారు. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో నాలుగు వందల మీటర్ల రిలే పరుగులో రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ పి.రమణమూర్తి మూడవ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించారు.

పీవీటీజీల సంక్షేమాన్ని విస్మరించిన జగన్

అంత్యోదయ కార్డులను రద్దుచేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదే

టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

చింతపల్లి, ఫిబ్రవరి 9: జిల్లాలో పీవీటీజీల అభివృద్ధి, సంక్షేమాన్ని ముఖ్యమంత్రి జగన్ విస్మరించారని టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. మండలంలోని గోడుగుమామిడి గ్రామంలో శుక్రవారం జరిగిన పీవీటీజీల ఆత్మీయ సమ్మేళ కార్యక్రమానికి ఆమె హాజరై ప్రసంగించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పీవీటీజీల అభివృద్ధికి పెద్దపీట వేసినట్టు చెప్పారు. పీవీటీజీ గ్రామాలకు అంతర్గత సీసీ రోడ్లు, పక్కా గృహాలు, మంచి నీటి పథకాలు అందించినట్టు వివరించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక పీవీటీజీలను పట్టించుకోవడం మానేసిందన్నారు. కేవలం ఓటర్లుగానే పరిమితం చేసిందన్నారు. పీవీటీజీలకు అంత్యోదయ కార్డులను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందని చెప్పారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టి 15 రకాల పథకాలను కూడా వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఇప్పటికైనా పీవీటీజీలు ఐక్యతగా ముందుకు వెళ్తూ, వైసీపీ ప్రభుత్వ మోసాలను ఓటుతో ఎండగట్టాలన్నారు. పీవీటీజీలకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలు అందాలంటే టీడీపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పీవీటీజీలు వచ్చే ఎన్నికల్లో టీడీపీ అండగా నిలవాలని, చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకుంటేనే పీవీటీజీల బతుకులు బాగుపడతాయని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాంగి రాము, రమణ, అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

కంఠారం అగ్నిప్రమాద బాధితలకు ఆర్థిక సాయం

కొయ్యూరు: కంఠారం గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి ఆర్థిక సహాయం అందించి మనవత్వం చాటుకున్నారు. శుక్రవారం కంఠారం గ్రామం వెళ్లిన ఆమె బాధిత కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం బాధిత కుటుంబాలకు వంట పాత్రలు, నిత్యావసర సరకులు, దుస్తులతో పాటు రూ.25 వేల నగదును అందజేశారు. బాధిత కుటుంబాలను పూర్తిస్థాయిలో ఆదుకునేందుకు మరింత సహాయ సహకారాలను అందిస్తామని ఈ సందర్భంగా గిడ్డి ఈశ్వరి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జి.సత్యనారాయణ, కార్యదర్శి దొరబాబు, ఎస్‌టి సెల్ రాష్ట్ర కార్యదర్శి రామూర్తి, నాయకులు శ్యామ్, మూర్తి, ఎరుకునాయుడు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సైకో పాలనను అంతం చేద్దాం: మాజీ మంత్రి మణికుమారి

పాడేరు రూరల్: రాష్ట్రంలో సైకో జగన్ పాలనను అంతం చేసి చంద్రబాబును సీఎంను చేసేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని మాజీ మంత్రి మత్స్యరాస మణికుమారి పిలుపునిచ్చారు. మండలంలోని గుడివాడ, లోచలిపుట్టు గ్రామాల్లో శుక్రవారం బాబు షూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనుల మనుగడ, గ్రామాల్లో భవిష్యత్ ఉండాలంటే అందరూ సైకిల్ ఎక్కాలని, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. సైకో జగన్ పాలనను అంతం చేస్తే తప్ప రాష్ట్రానికి గుర్తింపు రాదన్నారు. టీడీపీ నేత కొట్టగుళ్లి సుబ్బారావు మాట్లాడుతూ అధికారం చేపట్టిన నాటి నుంచి దోచుకోవడం, దాచుకోవడం, మాట తప్పడం-మడం తిప్పడం తప్ప వైసీపీ ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన అభివృద్ధి ఏముందని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రజలు చైతన్యవంతులై చంద్రబాబును సీఎంను చేసేందుకు సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వంజంగి కాంతమ్మ, మాజీ ఎంపీపీ వర్తన ముత్యాలమ్మ, మాజీ సర్పంచ్ వర్తన పిన్నయ్యదొర, ఎన్టీఆర్ సంఘ అధ్యక్షుడు పూసర్ల గోపి, పార్టీ నాయకులు అమరావతి, గంగమ్మ, కె.ఈశ్వరమ్మ, సీతక్క, మాధవి, మణి, రత్నాలమ్మ, పార్వతి, అప్పలకొండ, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

మోదాపల్లి మాజీ సర్పంచ్ లుధియానా మృతి



లుధియానా (ఫైల్)

పాడేరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మోదాపల్లి మాజీ సర్పంచ్ జన్ని లుధియానా (76) శుక్రవారం మృతి చెందారు. మోదాపల్లి పంచాయతీ అమ్మవారి పాదాలుకు చెందిన లుధియానా కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ విశాఖలో చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. ఈ విషయం తెలుసుకున్న వివిధ ప్రాంతాలకు చెందిన కుటుంబీకులు, బంధువులు అధిక సంఖ్యలో తరలివచ్చి నివాళులర్పించారు. టీడీపీ సీనియర్ నేతలు మత్స్యరాస మణికుమారి, బొర్రా నాగరాజు, లొట్టి గణేశ్, మాజీ ఎంపీపీ మంగ్లన్నదొర, వివిధ పార్టీలకు చెందిన నేతలు ఆమె పార్థివ దేహాన్ని సందర్శించి కుటుంబానికి సంతాపం తెలిపారు.

నరకమా లేక వసతి గృహమా?

... 3వ పేజీ తరువాయి



తలుపుల్లేని కిటికీకి వస్త్రాలు కట్టుకున్న విద్యార్థినులు.. పెచ్చులూడిపోతున్న భవనం శ్లాబ్.. అక్కడే చదువుకుంటున్న బాలికలు

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్నారు.

చాలీచాలని గదుల్లో బస

విద్యార్థినులు చాలీచాలని గదుల్లో బస చేస్తున్నారు. వసతి గృహంలో మూడు నుంచి పదో తరగతి వరకు 87 మంది విద్యార్థినులు ఉంటున్నారు. రెండు భవనాల్లో ఐదు గదులున్నాయి. ఒక భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. భవనంపై నుంచి పెచ్చులు ఊడి కిందకు పడుతున్నాయి. ఫ్లోరింగ్ కూడా పూర్తిగా పాడైపోయింది. కిటీకిలకు తలుపులు లేవు. దీంతో వస్త్రాలను అడ్డంగా కట్టుకుని విద్యార్థినులు కాలం వెల్లబుచ్చుతున్నారు.

ఒకే ఒక మరుగుదొడ్డి

వసతి గృహంలోని 87మంది విద్యార్థినులకు ఒక స్నానపు గది, మరో మరుగుదొడ్డి మాత్రమే ఉన్నది. మరుగదొడ్డి, స్నానపు గదికి తలుపులు ఊడిపోయాయి. విద్యార్థినులకు సరిపడినన్ని మరుగుదొడ్లు, స్నానపు గదులు లేకపోవడంతో వేకువజాము ఐదుగంటలకు లేచి క్యూ పద్ధతిలో వినియోగించుకోవాల్సి వస్తున్నది. కాస్త చిన్నపిల్లలు సిగ్గు విడిచి ఆరుబయట స్నానాలు చేస్తున్నారు. కొంత మంది పెద్ద పిల్లలు సైతం ఐదు గంటలకు చీకట్లో బయట స్నానాలు చేస్తున్నారు.

నేలపైనే పడక

వసతి గృహంలో విద్యార్థినులందరూ నేలపైనే నిద్రిస్తున్నారు. వీరికి బంకర్ బెడ్స్ అందుబాటులో లేవు. రెండు గదుల్లో ఫ్లోరింగ్ పాడైపోయినప్పటికి చాపలు, దుప్పట్లు పరుచుకుని నిద్రపోతున్నారు. శీతాకాలం, వర్షాకాలంలో వీరు ఇబ్బంది పడుతున్నారు. వీరు చదువుకోవడానికి అవసరమైన విద్యుత్ సదుపాయం లేదు. ఒక్కొక్క గదిలో ఒక బల్బు మాత్రమే ఉండడంతో ఇబ్బంది పడుతున్నారు. ఒక్క ఫ్యాన్ కూడా లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు.

సకాలంలో పాఠశాలకు వెళ్లలేకపోతున్నాం

- గెమ్మెలి సుమిత్ర, పదో తరగతి

ఒక స్నానపుగది, ఒక మరుగుదొడ్డి మాత్రమే ఉండడంతో మేమంతా ఒకేసారి కాలకృత్యాలు తీర్చుకునేందుకు చాలా ఇబ్బంది పడుతున్నాం. ఉదయం ఐదు గంటలకు నిద్రలేచినా 8:30 గంటలలోపు సిద్ధపడలేకపోతున్నాం. ఒకరు మరుగుదొడ్డికి వెళితే మరొకరు బయట నిరీక్షించాల్సి వస్తున్నది. ఈ కారణంగా సకాలంలో పాఠశాలకు వెళ్లలేకపోతున్నాం. ఉన్నతాధికారులు స్పందించి మాకు అవసరమైన మరుగుదొడ్లు నిర్మించాలి.

శాశ్వత భవనాలు నిర్మించాలి

- పాంగి దీప్తిరాణి, పదో తరగతి

ఎన్నో ఏళ్లుగా టీడీపీ క్వార్టర్స్‌లో వసతి గృహాన్ని కొనసాగిస్తున్నారు. శాశ్వత భవనాలు నిర్మించేందుకు రెవెన్యూ అధికారులు స్థలం కేటాయించారు. అయితే ఇంత వరకు శాశ్వత భవనాలు నిర్మించలేదు. ప్రస్తుతం శిథిలావస్థకు చేరిన భవనంలో బస చేస్తున్నాం. భవనం పైకప్పు నుంచి పెచ్చులు ఊడిపడుతున్నాయి. భవనం ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి. దీంతో చాలా ఇబ్బంది పడుతున్నాం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి శాశ్వత భవనాలు నిర్మించాలి.

వణికిస్తున్న చలి

... 3వ పేజీ తరువాయి

లైట్లు వేసుకుని నెమ్మదిగా ప్రయాణిస్తున్నారు.

ముంచంగిపుట్టులో..

ముంచంగిపుట్టు: మండల పరిధిలో చలి తీవ్రత పెరిగింది. శుక్రవారం ముంచంగిపుట్టులో ఉదయం 11 గంటలు వరకు పూర్తి స్థాయిలో మంచు తెరలు వీడలేదు. మంచు దట్టంగా కమ్ముకోవడంతో లైట్ల వెలుతురులో వాహనాలు రాకపోకలు సాగించాల్సి వచ్చింది. సాయంత్రమైతే చాలు చలి మొదలవుతోంది.

నేడు చింతపల్లికి షర్మిల

... 3వ పేజీ తరువాయి

చింతపల్లి వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సభ జరిగిన స్థలంలోనే షర్మిల సభను కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేయడం విశేషం.

కట్టుదిట్టమైన భద్రత

షర్మిల పర్యటనకు పోలీసు అధికారులు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ప్రత్యేక పోలీసు బలగాలు లంబసింగి ఘాట్ నుంచి చింతపల్లి, చౌడుపల్లి ప్రాంతాల్లో మోహరించాయి. ప్రధాన రహదారులు, సభా వేదిక వద్ద బాంబ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు నిర్వహించాయి. చింతపల్లి అదనపు ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్ పర్యవేక్షణలో ప్రత్యేక పోలీసు బలగాలు గస్తీ నిర్వహిస్తున్నాయి.

3.35 లక్షల మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు

» ఇన్‌చార్జి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిణి సాధన

పాడేరు రూరల్, ఫిబ్రవరి 9: జిల్లాలో జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించామని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి, ఇన్‌చార్జి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి సిహెచ్.సాధన తెలిపారు. మండలంలోని శ్రీకృష్ణాపురం బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఆమె అల్బెండజోల్ మాత్రలను స్వయంగా వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని 6,475 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో 3,35,065 మంది 18 ఏళ్ల లోపు విద్యార్థినీ, విద్యార్థులు ఉన్నారన్నారు. వారందరికీ శుక్రవారం ఆల్బెండ్‌జోల్ మాత్రలను వైద్య సిబ్బంది వేయించారన్నారు. గిరిజన ప్రాంతంలో విద్యార్థినీ, విద్యార్థులు ఎక్కువగా రక్తహీనతతో బాధపడుతున్నారన్నారు. ఆరు నెలలకు ఒకసారి నులిపురుగుల మాత్రలు వేసుకోవాలన్నారు. పిల్లలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. నులిపురుగులు వల్ల రక్తహీనతతో పాటు ఆకలి మందగించడం, బరువు పెరగకపోవడం, కడుపునొప్పి, వాంతులు, విరోచనాలు వంటి ఇబ్బందులకు గురవుతారన్నారు. ఈ కార్యక్రమంలో మినుములూరు పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాలకృష్ణ, రాష్ట్రీయ బాల సురక్ష జిల్లా మేనేజర్ వైకిశోర్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుల, పాఠశాల ఉపాధ్యాయులు, మినుములూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీకృష్ణాపురం పాఠశాలలో బాలికలకు మాత్రలు వేస్తున్న డీఎంహెచ్‌వో సాధన

పోలింగ్ కేంద్రాలు సౌకర్యవంతంగా ఉండాలి

» జిల్లా జాయింట్ కలెక్టర్ భావన

కొయ్యూరు, ఫిబ్రవరి 9: మండలంలో పోలింగ్ బూత్‌లను సౌకర్యవంతంగా ఆధునికీరిచాలని జిల్లా జాయింట్ కలెక్టర్ భావన సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎన్నికల అధికారులు, బీఎల్‌వోలతో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలోని 56 పోలింగ్ బూత్‌ల పరిస్థితిపై ఆరా తీశారు. విద్యుత్, మరుగుదొడ్లు, దివ్యాంగులను తరలించేందుకు అనువుగా ర్యాంప్‌లు, తాగునీటి సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. అలాగే ఎన్నికల నిర్వహణపై 66 పేజీల పుస్తకాన్ని రూపొందించడం జరిగిందని దీనిపై త్వరలో శిక్షణ ఇస్తామని చెప్పారు. అనంతరం రాజేంద్రపాలెంలో ఎండీయూ వాహనాల ద్వారా జరుగుతున్న పీడీఎస్ రైస్ పంపిణీని పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వరరావు, జేఈలు రామకృష్ణ, విశ్వతేజ, ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్, ఎంఈవో రాంబాబు, వీఆర్‌వోలు, బీఎల్‌వోలు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఏబులంలో దారిదోపిడీకి యత్నం

గూడెంకొత్తవీధి, ఫిబ్రవరి 9: మండలంలోని ఏబులం వంతెన వద్ద గుర్తు తెలియని వ్యక్తులు దాడిదోపిడీకి యత్నించారని బాధితుడు చిన్నబాబు తెలిపాడు. బాధితుడు కథనం ప్రకారం దేవరాపల్లి గ్రామానికి చెందిన చిన్నబాబు గురువారం వ్యక్తిగత పనిపై సీలేరు వెళ్లాడు. శుక్రవారం సాయంత్రం స్వగ్రామానికి వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులో ఏబులం చేరుకున్నారు. గ్రామానికి వెళ్లేందుకు వాహన సదుపాయం లేకపోవడం వల్ల కాలినడకన వెళుతుండగా, పారికలు దాటిన తరువాత ఏబులం బ్రిడ్జి వద్ద గుర్తుతెలియని దుండగుడు తన బ్యాగ్, సెల్ ఫోన్ లాక్కునే ప్రయత్నం చేశాడని బాధితుడు తెలిపాడు. అతడిని గట్టిగా నెట్టి ప్రతిఘటించడంతో అక్కడ నుంచి పారిపోయాడని తెలిపారు. అక్కడ నుంచి మరో మార్గంలో స్వగ్రామానికి చేరుకున్నానని బాధితుడు తెలిపాడు. ఈ ఘటనలపై పోలీసులు స్పందించాలని కోరారు.

యూబీఎం ఏటీఎం మొరాయింపు



మూతబడిన యూబీఐ ఏటీఎం కేంద్రం

సీలేరు, ఫిబ్రవరి 9: సీలేరులో యూనియన్ బ్యాంక్ ఏటీఎం మొరాయిస్తున్నది. సాంకేతిక లోపాలతో నిత్యం మూతపడతుండటంతో ఈ ప్రాంత వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సీలేరు చుట్టుపక్కల పలు గ్రామాలతో పాటు ఒడిశా సరిహద్దు ప్రజలకు ఈ ఏటీఎం ఒక్కటే దిక్కు. సీలేరు తప్పితే 60 నుంచి 70 కిలోమీటర్ల వరకు చుట్టుపక్కల ప్రాంతంలో ఎక్కడా ఏటీఎం సౌకర్యం లేదు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలంతా సీలేరు యూనియన్ బ్యాంక్ ఏటీఎంపైనే ఆధారపడుతున్నారు. ఈ ఏటీంఎ తరచూ సాంకేతిక పరమైన లోపాలతో మూతపడుతోంది. ఇదే తరహాలో నాలుగు రోజులు ఏటీఎం పనిచేయడం లేదు. దీనిపై బ్యాంక్ మేనేజర్ చిన్నబాబును వివరణ కోరగా, వినియోగదారులు ఏటీఎంలో లిమిట్ కంటే అధికంగా డబ్బులు డ్రా చేయడంతో పాటు చిల్లర నోట్లను డిపాజిట్ చేస్తుండడంతో పాంకేతిక లోపాలు తలెత్తుతున్నాయని చెప్పారు. దీని మరమ్మతులకు విశాఖపట్నం ఇంజనీర్ రావాల్సి వస్తోందని ఆయన తెలిపారు.

కారుకు డీజిల్ కొట్టించి ఉడాయించారు

» జీసీసీ పెట్రోల్ బంక్‌లో ఆగంతుకుల ఆగడం

సీలేరు, ఫిబ్రవరి 9: సీలేరు జీసీసీ పెట్రోల్ బంక్‌లో కారులో డీజిల్ కొట్టించుకుని డబ్బు చెల్లించకుండా యువకులు ఉడాయించిన సంఘటన చోటు చేసుకుంది. డొంకరాయి వైపు నుంచి ఒక తెల్ల కారు పెట్రోల్ బంక్‌కు వచ్చి రూ.4 వేల డీజిల్ కొట్టించుకుని ఫోన్ పే చేస్తామని చెప్పడంతో స్కానర్ తీసుకురావడానికి ఆఫీసు రూమ్‌లోకి వెళ్లామని, వచ్చేలోగా యువకులు కారును వేసుకుని అక్కడ నుంచి ఉడాయించారని బంక్ బాయ్ కిల్లో సుకదాస్ తెలిపారు. నైట్ డ్యూటీలో ఉన్న మరో వ్యక్తి బైసెట్టి శివ బైక్‌పై కారును వెంబడించినా పారిపోయారని తెలిపారు. దీనిపై జీసీసీ ఇన్‌చార్జికి సమాచారం ఇచ్చామన్నారు.

బోడిదొర ఆరోగ్యంపై స్పందించిన కలెక్టర్

» మెరుగైన వైద్య సేవల కోసం కేజీహెచ్‌కు తరలింపు.. ఖర్చులకు నగదు పంపిణీ



బోడిదొర ఆరోగ్య స్థితిని ఫోన్‌లో కలెక్టర్‌కు వివరిస్తున్న ఎంపీడీవో

కొయ్యూరు, ఫిబ్రవరి 9: స్వాతంత్ర్య సమరయోధుడు గాం మల్లుదొర, గంటందొర వారసుడు బోడిదొర ఆరోగ్య పరిరక్షణ బాధ్యతను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తీసుకున్నారు. 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన ప్రత్యేక కథనానికి ఆయన స్పందించారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీవో సీతయ్యను పంపించి బోడిదొర ఆరోగ్య స్థితిగతులను తెలుసుకుని వెంటనే సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. దీంతో అయన హుటాహుటిన బోడిదొర స్వగ్రామమైన లంకవీధి వెళ్లారు. అప్పటికే బోడిదొరను నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు తెలుసుకుని, అక్కడి నుంచి నర్సీపట్నం వెళ్లారు. తీవ్ర రక్తహీనత బారిన పడి నీరసించి ఉన్న బోడి దొరను చూసి, అతని ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను సంప్రదించి విషయాన్ని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌కు ఫోన్‌లో తెలిపారు. బోడిదొర ఆరోగ్య పరిరక్షణకు మెరుగైన వైద్య సేవలు అవసరమని వైద్య వర్గాల ద్వారా తెలుసుకున్న కలెక్టర్, హుటాహుటిన విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించేలా చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా తక్షణమే అంబులెన్సు సమకూర్చుతో పాటు బోడిదొర వెంట కుటుంబీకులు, ఏఎన్ఎం, పంచాయతీ కార్యదర్శిని పంపాలని ఆదేశించారు. అలాగే ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు అందించాలని ఎంపీడీవోకు ఆదేశించారు. దీంతో ఎంపీడీవో ఆధ్వర్యంలో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో వైద్యసేవలు పొందుతున్న బోడిదొరను హుటాహుటిన కేజీహెచ్‌కు తరలించారు.

ఏరియా ఆస్పత్రిలో హెర్నియా శస్త్ర చికిత్స



హెర్నియా శస్త్రచికిత్స చేసిన వైద్యులు, సిబ్బంది... (ఇన్‌సెట్‌లో) సత్తిబాబు

చింతపల్లి, ఫిబ్రవరి 9: స్థానిక ఏరియా ఆస్పత్రిలో వైద్యులు హెర్నియా శస్త్ర చికిత్స చేశారు. కొంత కాలంగా సాధారణ చికిత్సకే పరిమితమైన ఏరియా ఆస్పత్రిలో ప్రత్యేక వైద్య నిపుణుల నియామకంతో మేజర్ శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయి. శుక్రవారం చింతపల్లి మండలం బెన్నవరం పంచాయతీకి చెందిన పాంగి సత్తిబాబు తీవ్ర అస్వస్థతతో ఏరియా ఆస్పత్రికి వచ్చాడు. వైద్యులు పరీక్షలు నిర్వహించి సుమారు ఆరు నెలలుగా హెర్నియా వ్యాధితో బాధపడుతున్నట్టు గుర్తించారు. జనరల్ సర్జన్ అజయ్‌బాబు, అనస్తీషియా విక్రం వెంటనే హెర్నియాకు శస్త్ర చికిత్స చేసేందుకు ఏర్పాటు చేశారు. రెండు గంటలు పాటు వైద్య నిపుణులు శ్రమించి బాధితుడికి మెస్ వేసి హెర్నియా రంధ్రానికి శస్త్రచికిత్స చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్, అనస్తీషియా వైద్యులు విక్రమ్ విలేకులతో మాట్లాడుతూ ఆస్పత్రిలో ఆరుగురు ప్రత్యేక వైద్యనిపుణులు ఉన్నారన్నారు. దీంతో ఆర్థోపెడిక్ వైద్యులు సాయికుమార్ సిమ్మెంట్ కట్టులు, విరిగిన ఎముకలకు శస్త్రచికిత్సలు చేస్తున్నారన్నారు. ఈఎన్‌టీ చంద్రశ్రీ గొంతు సంబంధిత వ్యాధులకు మెరుగైన చికిత్స అందిస్తున్నారు. స్త్రీ వైద్యనిపుణులు సుధాశారద సిజేరియన్ కాన్పులు చేస్తున్నారన్నారు. అలేగా మగ, ఆడవారికి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు జరుగుతున్నాయన్నారు. ప్రజలు ప్రత్యేక వైద్యనిపుణులు సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ కోరారు.

ఎస్టీ దొంగ సర్టిఫికెట్లు రద్దు చేయాలని ఆందోళన



ప్రధాన రోడ్డులో మానవహారం చేస్తున్న నేతలు, గిరిజనులు

అరకులోయ, ఫిబ్రవరి 9: ఎస్టీ దొంగ సర్టిఫికెట్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా కన్వీనర్ రామారావు దొర ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. మన్యంలోని 11 మండలాల నుంచి పెద్ద ఎత్తున ప్రజా ప్రతినిధులు, నాయకులు, గిరిజనులు తరలి వచ్చారు. ముందుగా ఎన్టీఆర్ పార్కు నుంచి అరకులోయ నాలుగు రోడ్ల జంక్షన్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం మానవహారం నిర్వహించారు. ఏజెన్సీలోని అన్ని మండలాల్లో ఎస్టీ దొంగ సర్టిఫికెట్లను రద్దు చేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు సమర్డి గోపాలరావు, మహాదేవ్, కిల్లో ఆనంద్, కిల్లో రామచందర్, అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి 'పల్లెకు పోదాం' దోహదం

» బీజేపీ గిరిజన మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు

పాడేరు రూరల్, ఫిబ్రవరి 9: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పల్లెకు పోదాం కార్యక్రమం దోహదపడుతుందని బీజేపీ గిరిజన మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కురసా ఉమామహేశ్వరరావు అన్నారు. మండలంలోని వంజంగి పంచాయతీ పోతురాజుమెట్ట గ్రామంలో శుక్రవారం పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిపై దృష్టిసారిస్తే, వైసీపీ ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తూ 14, 15వ ఆర్థిక సంఘం నిధులను దొడ్డి దారిన దోచుకుని గ్రామ పంచాయతీలు అభివృద్ధికి అడ్డంకిగా నిలుస్తున్నదని చెప్పారు. రాష్ట్ర సంక్షేమానికి, గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందించిన నిధులు, వివిధ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ గిరిజన మోర్చ మేధావుల విభాగం రాష్ట్ర కన్వీనర్ కురసా పార్వతమ్మ, నాయకులు నందోలి శివకృష్ణ, కొర్రా బొంజుబాబు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

జూనియర్ కళాశాలగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల అప్‌గ్రేడ్

కొయ్యూరు, ఫిబ్రవరి 9: ప్రభుత్వ జూనియర్ కళాశాలగా కొయ్యూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను అప్‌గ్రేడ్ చేస్తూ విద్యా శాఖాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొన్నేళ్లుగా కొయ్యూరులో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలనే విద్యార్థుల తల్లిదండ్రుల విజ్ఞాపన సాకారమైంది. కొయ్యూరులో కో-ఎడ్యుకేషన్‌తో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికి వినతిపత్రాలు సమర్పించగా, ఆమె రాష్ట్ర విద్యా శాఖ దృష్టికి తీసుకు వెళ్లారు. రాష్ట్రంలోని 206 మండలాలలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో కొయ్యూరులో జూనియర్ కళాశాల ఏర్పాటుకు అనుమతి వచ్చినట్టు ఎంపీపీ బడుగు రమేష్‌బాబు తెలిపారు.

'వైసీపీ నేతలవి అసత్య ప్రకటనలు'

జి.మాడుగుల, ఫిబ్రవరి 9: వైసీపీ నాయకులు అసత్య ప్రకటనలు చేస్తున్నారని టీడీపీ, జనసేన నేతలు ఆరోపించారు. భీరం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో 40 కుటుంబాలు వైసీపీలో చేరినట్టు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి విశ్వేశ్వరరాజు తప్పుడు ప్రకటన చేసుకున్నారన్నారు. ఈ మేరకు టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమెలి చిట్టిబాబు ఆధ్వర్యంలో తాడివీధిలో శుక్రవారం అత్యవసర సమావేశం నిర్వహించి మాట్లాడారు. వైసీపీకి చెందిన నాలుగు కుటుంబాలకే మరలా పార్టీ కండువాలు ధరించి వైసీపీలో చేరినట్టు ప్రకటనలు ఇచ్చుకున్నారని ఎద్దేవా చేశారు. మిగిలిన వారికి బలవంతంగా కండువాలు వేశారని ఆరోపించారు. సమావేశంలో సర్పంచ్ ఎం.రత్నకుమారి, నాయకులు బొంజుబాబు, బొంజునాయుడు, రమణబాబు, రాంబాబు, లక్ష్మయ్య, చిరంజీవి, శ్రీనివాస్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆదివాసీ డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వాలి

అరకులోయ, ఫిబ్రవరి 9: ఆదివాసీ డీఎస్సీ అభ్యర్థులకు ప్రభుత్వం ఉచిత శిక్షణ ఇవ్వాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ డిమాండ్ చేశారు. గిరిజన్ భవన్‌లో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలో డీఎస్సీ అభ్యర్థుల కోసం ఉచిత శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. తద్వారా వేలాది మంది గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులు శిక్షణ ఇచ్చి ఆర్థిక భారం లేకుండా చూడాలని విన్నవించారు. అరకులోయ, పాడేరు, చింతపల్లిలో ఈ కేంద్రాలను ఏర్పాటుచేస్తే అభ్యర్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు బుజ్జిబాబు, పి.నాపిబాబు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనకు చర్యలు

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 9: పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనకు చర్యలు చేపడతామని తహసీల్దార్ హేమవతి చెప్పారు. మండలంలోని కొర్రా పోలింగ్ కేంద్రంలో సౌకర్యాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనపై దృష్టిసారించామన్నారు. ఓటర్లకు ఇబ్బందులు లేకుండా మరుగుదొడ్లు, వాడుక నీటితో పాటు తాగునీటి సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ హరి, సీనియర్ అసిస్టెంట్ కామరాజు, సర్పంచ్ అర్జున్, ఎంపీటీసీ సభ్యురాలు విజయ, ఉప సర్పంచ్ మాలిక్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి: ఏఎస్పీ ధీరజ్

జి.మాడుగుల, ఫిబ్రవరి 9: గిరిజన యువత క్రీడల్లో నైపుణ్యం రాణించాలని పాడేరు ఏఎస్పీ ధీరజ్ సూచించారు. సీఆర్‌పీఎఫ్ 198 బెటాలియన్ ఆధ్వర్యంలో శుక్రవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో మెగా వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో ఆరు టీములు పాల్గొనగా సొలభం పంచాయతీ డేగలరాయి మొదటి స్థానం సాధించగా, రెండో స్థానంలో జి.మాడుగుల పంచాయతీ బూసిపల్లి టీం నిలిచింది. ఇరు జట్లుకు ఏఎస్పీ ధీరజ్, డిప్యూటీ కమాండెంట్ భగత్‌సింగ్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అలాగే విజేతలతో పాటు పోటీల్లో పాల్గొన్న ప్రతి టీం సభ్యులకు క్రీడా దుస్తులు, వాలీబాల్ కిట్లు అందించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ గిరిజన యువకులు చెడు అలవాట్ల జోలికి పోకూడదని, క్రీడలపై దృష్టిసారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ రమేశ్, ఎస్‌ఐ శ్రీనివాసరావు, సీఆర్‌పీఎఫ్ ఇన్‌చార్జి రవికుమార్, సెన్స్ రాజ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు అవసరం

» సీఆర్‌పీఎఫ్ ఏసీ రాజ్‌కుమార్

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 9: మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరమని సీఆర్‌పీఎఫ్ 198 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ రాజ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం సీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో వాలీబాట్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో వనభసింగి, జర్జుల పంచాయతీల పరిధిలోని లుంగాపుట్టు, చోటాముఖిపుట్టు, చినతమింగుల, అమలగూడ, కులబీరు, జర్జుల గ్రామాలకు చెందిన వాలీబాట్ టీమ్‌లు పాల్గొన్నాయి. హోరాహోరీగా జరిగిన పోరులో కులబీరు జట్టు విజయం సాధించగా, చినతమింగల జట్టు రన్నర్‌గా నిలిచింది. విజేతలకు షీల్డ్‌లతో పాటు క్రీడా దుస్తులు, పరికరాలను ఏసీ అందజేశారు. క్రీడా పోటీల్లో పాల్గొని గిరి యువకులు నైపుణ్యం పెంచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ కె.రవీంద్ర, సర్పంచ్ వి.లక్ష్మణ్, సీఆర్‌పీఎఫ్ జవాన్లు పాల్గొన్నారు.

పెదబయలులో..

పెదబయలు: రూడకోట అవుట్‌పోస్టులో రెండు రోజుల పాటు జరిగిన వాలీబాల్ టోర్నమెంట్ శుక్రవారం ముగిసింది. ఈ టోర్నీలో పరిసర గ్రామాల నుంచి ఆరు జట్లు పాల్గొనగా, కుమడ జట్టు విజయం సాధించింది. కాంగ్రంగివలస జట్టు రన్నర్‌గా నిలిచింది. ఇరు జట్లకు సీఆర్పీఎఫ్ 198 బెటాలియన్ డిప్యూటీ కమాండెంట్ భగత్‌సింగ్, డీఎస్పీ త్రిలోచన్ బేరా, ఇన్‌స్పెక్టర్ ఏకే మిశ్రా బహుమతులను అందజేశారు. గిరి యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు వివిధ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు ఈ సందర్భంగా వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ మనోజ్‌కుమార్, వైద్యులు కిశోర్, సత్తారావు, మాజీ సర్పంచ్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించరూ..

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 9: దోడిపుట్టు పంచాయతీ పరిధిలోని బీటిచంప గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని సీపీఎం మండల నేత ఎం.ఎం.శ్రీను కోరారు. గ్రామాన్ని శుక్రవారం సందర్శించి అక్కడ సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలో తాగునీటి పథకం సక్రమంగా పనిచేయడం లేదని, దీంతో గుక్కెడు నీటికి గిరిజనుల ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని సమస్య జఠిలం కాకుండా అధికారులు చూడాలని కోరారు.